క్లుప్తంగా

ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి



తాడికొండ: ఈ నెల 21న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఎన్జీఓ కార్యదర్శి ఆర్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి కోరారు. తాడికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలతో నిర్వహించే ఈ రాష్ట్ర మహా సభకు ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు.

బీజేపీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలి



పొన్నెకల్లు(తాడికొండ): పార్టీ బలోపేతానికి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి యామిని శర్మ, జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో బుధవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పొన్నెకల్లు గ్రామానికి చెందిన యడ్లపల్లి గాంధీ రామ్మోహన్‌కు జిల్లా కో ఆపరేటివ్ సెల్ ఉపాధ్యక్షునిగా నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఛరక కుమార్ గౌడ్, జిల్లా యువమోర్చా అధ్యక్షులు మైలా హరికృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, రాజేష్ నాయుడు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కోటా సాంబశివరావు, మండల ప్రధాన కార్యదర్శి చెర్లోపల్లి చెరయ్య పాల్గొన్నారు.

మారియమ్మకు ప్రత్యేక పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మారియమ్మకు భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 21 రోజులుగా దీక్షలు చేసిన భక్తులు చివరిరోజు జలపాలేశ్వరస్వామి ఆలయం ముఖమండపంలో అర్చకులు ఉమాపతిశాస్త్రి పూజలు చేసి ఇరుముడులు అందజేశారు. ఉదయాన్నే మారియమ్మకు అష్టోత్తర, సహస్రనామ పూజలు, కుంకుమార్చనలు చేసి ఇరుముడి తలపై ఉంచారు. ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి గ్రామశివారులో కొండవద్ద ఉన్న మారియమ్మ ఆలయం వద్దకు కాలినడకన వెళ్లి కొబ్బరికాయలు కొట్టి, పొంగళ్లు నివేదన చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పలువురికి ఆర్థిక సాయం

మంగళగిరి: నగరంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన కోపూరి ప్రసాద్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. మృతికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సంతాపం తెలిపారు. అంత్యక్రియలు నిమిత్తం ఎమ్మెల్యే అందించిన రూ.10 వేలను వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు సంకె సునీత అందించారు.

ప్లాట్ ఫారం రిక్షాలు అందజేత...

నగరంలోని పార్కు రోడ్డుకు చెందిన కర్లగుంట విజయ్‌బాబు, కార్పొరేషన్ పరిధి కాజకు చెందిన రాము నాయక్, చిట్టిపోతల సాంబయ్యలకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహకారంతో ప్లాట్ ఫారం రిక్షాలను స్థానిక పార్టీ నాయకుల చేతుల మీదుగా బుధవారం నగరంలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అందజేశారు. నగరంలోని పలువురు నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, ఆకురాతి రాజేష్, రంగిశెట్టి పెద్దబ్బాయి, అంజి, మహిళా నాయకులు మల్లవరపు సుధారాణి, సంకె సునీత పాల్గొన్నారు.

యువతిపై లైంగిక దాడి

పట్నంబజారు: యువతిని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరుంధతీనగర్‌కు చెందిన యువతి గత కొన్నేళ్లుగా కాకానిలోని తన మేనత్త వద్ద ఉంటోంది. ఈ క్రమంలో మేనత్త భర్త అమీర్ యువతిని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దురాగతాన్ని యువతి జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పాత గుంటూరు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకరగుంట సమీపంలోని గాజువారివీధిలో నివాసం ఉండే నరసింహారావు (61) గత నెల 28న పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో బాలింతలకు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బిడ్డకు జన్మనిచే గర్భిణి ఆరోగ్యంగా ఉంటే పుట్టబోయే శిశువు కూడా ఆరోగ్యంగా పుడతానే ఉద్దేశంతో వైఎస్సార్ పోషకాహారాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రహమాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, జ్యోతి పాల్గొన్నారు.



దుగ్గిరాలలో గర్భిణులకు కిట్లను అందజేస్తున్న దుగ్గిరాల ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ తదితరులు



రేవేంద్రపాడులో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను అందజేస్తున్న సర్పంచి పలుకూరి మేరిమ్మ తదితరులు

రేవేంద్రపాడులో.....

రేవేంద్రపాడులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయంలో నిర్వహించారు. సర్పంచి శ్రీమతి పలుకూరి మేరిమ్మ హాజరయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.శరత్, ఉప సర్పంచి మధు, నాగదుర్గ పాల్గొన్నారు.

పెనుమాకలో....

ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ దామేష్‌రెడ్డి, పులి భుజంగరావు, బొక్కానాని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు

కొలనుకొండలో....

తాడేపల్లి రూరల్‌పరిధిలోని కొలనుకొండలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు నూతక్కి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జలి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకటేశ్వరరావు, కన్వీనర్ వై.నాగరాజు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంగా ఉండి వారికి పూర్తిస్థాయిలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్లు ఇంటివద్ద అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, ప్రత్యేకాధికారి యుగంధర్ కుమార్, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ డి.అనూరాధ, వైద్యాధికారి ఫరీనాబేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత పాల్గొన్నారు.



పెనుమాకలో కిట్లను అందుకున్న గర్భిణులు, బాలింతలు

మేడికొండూరులో..

మేడికొండూరు: పంచాయతీ కార్యాలయంలో బుధవారం టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్ పాల్గొని పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో వేచి చూడాల్సిన అవసరం లేదన్నారు. ఇంటి వద్దనే కిట్‌లు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.ప్రభాకరరావు పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ, ఎంపీపీ షహేలానర్గీస్

పోషక ఆహార కిట్ల పంపిణీ

మంగళగిరి: గర్భిణులు, శిశువుల సంక్షేమ కోసమే పోషక ఆహార కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని గణపతినగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూష అన్నారు. నగరంలోని గండాలయపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ, తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, శిశువులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పది రకాల పోషకాహార కిట్లను అందజేస్తుందన్నారు. శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకు రోగ నిరోధక వ్యవస్థ మెరుగవడంతో పాటు బ్రెయిన్ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ కె.సరిత, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్లు వేణికుమారి, రత్నకుమారి, హెల్త్ సెంటర్ సూపర్ వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎం యమున, అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త సీహెచ్ వినీల పాల్గొన్నారు.

యర్రబాలెంలో...

కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం సచివాలయం -1 ఆవరణలో బుధవారం గర్భిణులకు, బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, కాపరౌతు భాస్కరరావు, షేక్ గౌస్, రేమిణిశెట్టి గోపి పాల్గొన్నారు.



యర్రబాలెంలో గర్భిణులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కొలనుకొండలో కిట్లను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మంగళగిరి కిట్లను పంపిణీ చేస్తున్న యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి అనూష

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

తాడికొండ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌తో గర్భిణులు, బాలింతలకు పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తాడికొండ మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచి తోకల సరోజినీ అధ్యక్షత వహించారు. ప్రత్యేకాధికారి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంపూర్ణ పోషణ కిట్‌లో ఇచ్చే ఆహారం తినడం ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎంపీడీఓ అత్తోట దీప్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ తాడికొండ సూపర్‌వైజర్‌లు సీహెచ్ కళావతి, సీహెచ్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న ప్రత్యేకాధికారి సుధాకర్, ఎంపీడీఓ అత్తోట దీప్తి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: నగరంలోని ఏపీ టిడ్కో గృహ సముదాయం ఆవరణలోని నూతన విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో లైన్లు ఏర్పాటు చేయనున్న దృష్ట్యా గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. నగరంలోని నిడమర్రు రోడ్డులోని ఆర్ ఆర్ టవర్స్ నుంచి టిప్పర్ల బజారు, మార్కండేయ కాలనీ, రాజీవ్ గృహకల్ప పరిధిలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈమని రోడ్డుకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు పడి రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వైఎస్సా ర్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి ఈ తీసుకెళ్లడంతో సొంత ఖర్చులతో బుధవారం రోడ్ మరమ్మతులు చేపట్టారు. ఈమని గ్రామం నుంచి ఆర్ అండ్ బీ రోడ్ వరకు అధికారుల సూచనల మేరకు పనులు నిర్వహిస్తున్నారు. ఈ రోడ్డులో ఈమనితో పాటు పలు గ్రామాల ప్రజలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తూ ఉంటారు. జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే సొంత ఖర్చులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడడం హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి యేసురత్నం, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

జీఓ 108 రద్దు చేయాలి

మంగళగిరి: జీఓ నంబరు 108ని రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థులు బుధవారం నగరంలోని మిద్దె సెంటర్‌లో నిరసన తెలిపారు. జీఓ కాపీలను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వైద్య విద్యకు సంబంధించిన జీఓ నంబరు 108ని ఎస్ఎఫ్ఐ వ్యతిరేకిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మున్నా, రవితేజ, అఖిల్, లావణ్య, రమ్య పాల్గొన్నారు.

కేఎల్‌యూ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



పీహెచ్‌డీ పట్టా పొందిన దినేష్‌కుమార్

తాడేపల్లిరూరల్: కేఎల్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడు డి.దినేష్ కుమార్‌కి పీహెచ్‌డీ లభించినట్లు సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. వెబ్ సర్వీసెస్, క్లౌడ్ కంప్యూటింగ్‌పై గత ఏడు సంవత్సరాలుగా చేసిన పరిశోధనా ఫలితంగా పీహెచ్‌డీ సాధించారని చెప్పారు. దినేష్ కుమార్ మాట్లాడుతూ సర్వీస్ ప్రొవైడర్ మరియు వినియోగదారుల మధ్య సేవల అంగీకార పద్ధతిని ఉపయోగించి, అంతర్జాల సేవలలో జరిగే వైఫల్యాలను తగ్గించేందుకు తమ పరిశోధన ఉపయోగపడుతుందని వివరించారు. దీనిపైన అంతర్జాతీయ స్థాయిలో 4 పరిశోధనా పత్రాలను తాను ప్రచురించినట్లు పేర్కొన్నారు. దినేష్‌కుమార్‌ను విశ్వవిద్యాలయ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు అభినందించారు.


మహిళల పోరుయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



మహిళల పోరుయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

తాడేపల్లిరూరల్: హింసపై మహిళల పోరు యాత్ర పోస్టర్‌ను ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని కోరుతూ ఆగస్టు 8వ వరకు నిర్వహించనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోరుయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆగస్టు 8వ తేదీ విజయవాడ జింఖానా గ్రౌండ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పి.గిరిజ, అధ్యక్షులు దొంతిరెడ్డి విజయలక్ష్మి, నాయకులు ఎస్.తులసమ్మ, సుశీల, కె.మేరి, సీఐటీయూ నాయకులు బూరగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం -1వ సచివాలయం ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు గడ్డ మీద పుట్టిన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సచివాలయంలో నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. స్వాతంత్ర్య సమర యోధుల ప్రాణత్యాగాలను గుర్తు చేసుకుంటూ భావి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, ఎస్‌కే గౌస్, మేరిగ నాగేశ్వరరావు, రేమిణిశెట్టి గోపి, గోపిశెట్టి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

ఫిరంగిపురం: స్వాతంత్ర్య సమరయోధుడు పింగళివెంకయ్య అందరికి స్ఫూర్తి అని ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పింగళి వెంకయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచి మేడాబాబు, ఎంపీడీఓ డి.అనూరాధ, వైద్యురాలు ఫరీనాబేగం, కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 9వ జిల్లాస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్–2023లో 5వ తరగతి విద్యార్థి ముట్లూరి ప్రదీపాల్, 7వ తరగతి విద్యార్థి ముట్లూరి సింజోన్ అండర్–8, అండర్–12 విభాగాల్లో పాల్గొని బంగారు, రజత పతకాలను సాధించినట్లు వివరించారు. క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారన్నారు. విద్యార్థుల్ని ఆటలు, క్రీడల్లో ప్రోత్సహించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలోత్సవానికి విశేష స్పందన



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చిత్రలేఖం పోటీలకు సంబంధించి తాడేపల్లిలోని పలు పాఠశాలల నుంచి విశేష స్పందన లభిస్తోందని బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం, కేఎల్ రావ్ కాలనీ, పోలకంపాడు, మహానాడు, సుందరయ్యనగర్ తదితర ప్రాంతాల్లోని పాఠశాలలకు కరపత్రాలు అందజేసినట్లు చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 13వ తేదీన చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దుర్గి కోదండ రామయ్య, దర్శనపు విజయ్‌బాబు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించిన వలంటీర్



మంగళగిరి: చినకాకాని ఎన్నారై ఆస్పత్రిలో గుండె జబ్బుతో చికిత్స పొందుతున్న కోడిరెక్కల సుబ్బారావుకి కార్పొరేషన్ పరిధి యర్రబాలెం సచివాలయం -2కు చెందిన వలంటీర్ తాడిబోయిన శ్రీలక్ష్మి పింఛన్ అందజేశారు. గత కొన్ని రోజులుగా సుబ్బారావు ఎన్నారై వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న వలంటీర్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి వృద్ధాప్య పెన్షన్ రూ.2750, రాజధాని రైతు కూలీ పెన్షన్ రూ.2500 మొత్తం కలిపి రూ.5250 అందజేశారు.

ఘనంగా గంగానమ్మ గుడి పునః నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లిలోని గంగానమ్మ గుడి పునః నిర్మాణ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలో ఉన్న గ్రామ దేవత అయిన గంగానమ్మ దేవస్థానాన్ని కమిటీ సభ్యులు పునః నిర్మాణం చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గంగానమ్మ పోతురాజు మహాలక్ష్మి గ్రామ దేవతల సేవా సమితి సభ్యులు దొంతిరెడ్డి సాంబిరెడ్డి, భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చింత శ్రీరామ్, మేకా శ్రీధర్ రెడ్డి, బండి సాంబిరెడ్డి, పి.నాగబాబు, నారాయణ రెడ్డి, భక్తబృందం తమ్మా గీత, గంటల మణి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



తాడేపల్లిరూరల్: ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లి బకింగ్‌హామ్ కెనాల్‌లో యువకుడి మృతదేహం ఉందని పోలీసులకు బుధవారం సమాచారం వచ్చింది. ఘటనా స్థలానికి వెళ్లి ఆ మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా ఉండవల్లికి చెందిన కోట పవన్ అఖిల్(25)గా గుర్తించారు. వెంటనే తండ్రి వెంకటేశ్వరరావు, తల్లి వరలక్ష్మికి సమాచారం ఇవ్వడంతో మృతుడిని గుర్తించారు. ఆదివారం ఉదయం స్నేహితులతో కలసి క్రికెట్ ఆడడానికి వెళ్లి అనంతరం మద్యం తాగి బకింగ్‌హామ్ కెనాల్‌కు చేపల వేటకు వెళ్లాడు. అదేరోజు మధ్యాహ్నం ఉండవల్లి సెంటర్‌లో అమరావతి బస్టాప్ వద్ద మోహన్ అనే బజ్జి బండి వ్యాపారి మోహన్ వద్దకు వచ్చి తనకు టిఫిన్ పెట్టాలని అడగ్గా, నువ్వు గతంలో రూ.200 డబ్బులు ఇవ్వాలని, ఇస్తేనే పెడతానని మోహన్ తేల్చి చెప్పాడు. అంతటితో కోట పవన్ అఖిల్ మద్యం మత్తులో ఉండి బజ్జీ బండి ముందుకు మూత్రం పోశాడు. అక్కడ చిన్నపాటి వివాదం చోటుచేసుకుంది. అక్కడ నుంచి వెళ్లిపోయి కాలువలో ఈతకు దిగినట్లు స్నేహితుడి సమాచారం ఇచ్చాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని నుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో మొక్కల్ని నాటి వాటిని సంరక్షించే బాధ్యతల్ని విద్యార్థులు చేపట్టాలని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని పాఠశాలలో బుధవారం నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉర్దూ డీఐ షేక్ ఎండీ. ఖాసిం మాట్లాడుతూ పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా కాలుష్యానికి తావులేని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చిష్టీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పురుగు మందుతాగి రైతు ఆత్మహత్య



గుంటూరు రూరల్ (వట్టిచెరుకూరు): అప్పుల బాధతో మనస్థాపానికి గురై, ఇబ్బందులు తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు వివరాల మేరకు..కొర్నెపాడు గ్రామానికి చెందిన ఈగ జనార్దన్, సరస్వతీ దంపతులు గ్రామంలోని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జనార్దన్ గత రెండేళ్లుగా సుమారు ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, వ్యవసాయం చేస్తున్నారు. పత్తి, మిరప పంటలను పండిస్తున్నారు. గతేడాది వ్యవసాయంలో సుమారు రూ.7 లక్షలు నష్టపోవటంతో మనస్థాపానికి గురయ్యారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గ్రామంలోని పొలంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటన విషయం తెలిసిన మృతుని భార్య సరస్వతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.